రాష్ట్రంలో మళ్లీ 'ఫ్యాన్' ప్రభంజనం ఖాయం

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- కోరాడలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

పద్మనాభం: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కోరాడలో శుక్రవారం రాత్రి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి సీఎం కావడం తథ్యమన్నారు. రాష్ట్రం ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ ఇస్తున్నారన్నారు. కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతనే ప్రామాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలను మంజూరు చేసిన ఘనత సీఎం జగన్ మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు తనతో పాటు అన్ని శాఖల అధికారులను సీఎం జగన్ మోహన్ రెడ్డి మీ వద్దకు పంపించారని తెలిపారు. యాతపేట వాసులకు త్వరితగతిన జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణానికి స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కోరాడలో సంక్షేమ పథకాలకు రూ.8.85 కోట్లు ఇచ్చామని తెలిపారు. రూ.2.20 కోట్లుతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల మంజూరు పత్రాలను అందజేశారు.

సచివాలయ భవనం ప్రారంభం : కోరాడలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా ఆయన వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ భీమునిపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైస్ ఎంపీపీ కోరాడ మంజు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు కోండ్రోతు శ్రీనివాసరావు, మామిడి శివరామకృష్ణ, మరగడ అప్పారావు, కోన రమణ, సీర సూరప్పడు పాల్గొన్నారు.

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు


శ్రీశరణ్య వేంకటేశ్వరస్వామి

ఆనందపురం: మండలంలోని గంభీరం పైడా ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో కొలువుదీరిన శ్రీశరణ్య వేంకటేశ్వరస్వామి ఆలయ 14వ వార్షికోత్సవాన్ని నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ధర్మకర్తలు పైడా కృష్ణప్రసాద్, రమాదేవి దంపతులు తెలిపారు. శనివారం సాయంత్రం విష్వక్సేన పూజ, రక్షాబంధనం, మృత్యంగ్రహణం, అంకురార్పణ, యాగశాల ప్రవేశం ఉంటాయన్నారు. ఈ నెల 23న ఉదయం విశేష హోమం, ధ్వజారోహణం, పిల్లలు లేని దంపతులకు గరుడ ప్రసాద వితరణ, సాయంత్రం శ్రీవారి కల్యాణం, ప్రసాద వితరణ, 24న ఉదయం సుదర్శన హోమం, లక్ష్మీ హారతి, సాయంత్రం శ్రీలక్ష్మి అమ్మవారికి సహస్ర కలువు పుష్పార్చణ, ఈ నెల 25న ఉదయం శ్రీచక్ర స్నానం, పూర్ణాహుతి, ధ్వజారోహణ, సాయంత్రం ద్వాదశి ఆరాధనలు, పుష్పయాగం, ప్రసాద వితరణ ఉంటుందని వివరించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీవారి కృప పొందాలని వారు కోరారు.

కాలువలో పూడికతీత పనులకు శ్రీకారం


మద్దిలో సాగునీటి కాలువలో పూడిక తీత పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మండలంలోని మద్దిలో శుక్రవారం రాజు–వెంకటపతిరాజు చెరువుకు అనుసంధానంగా ఉన్న కర్నపోడు పొలం నుంచి జగ్గప్ప పొలం వరకు సాగునీటి కాలువలో మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో పూడిక తీత పనులకు ఎంపీపీ కంటుబోతు రాంబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 అడుగుల వెడల్పు ఉండే కాలువ పూడికపోయి ప్రస్తుతం మూడు అడుగులు మాత్రమే ఉందన్నారు. సుమారు కిలోమీటరు నిడివిలో 15 అడుగుల వెడల్పులో పూడిక తీయనున్నట్టు తెలిపారు. ఈ పూడిక తీత వల్ల సుమారు వంద ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, బుగత ఎర్నాయుడు, కనకల ప్రకాశ్, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పౌష్టికాహారంపై అవగాహన


కార్యక్రమంలో పాల్గొన్న వాసవ్య మహిళా మండలి సభ్యులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు చిన రుషికొండ వాడపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో వాసవ్య మహిళా మండలి కుషాల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై శుక్రవారం అవగాహన, ప్రదర్శన నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, మహిళల ఆరోగ్యానికి రాగిపిండితో వెజిటబుల్ సూప్ చేసి దాని పోషక విలువలను వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి ప్రాజెక్టు కమ్యూనిటీ కోఆర్డినేటర్లు షర్మిల, ప్రసన్నలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ కోమలి పాల్గొన్నారు.

25న గ్రామదేవతలకు పసుపు కుంకుమలు

తగరపువలస: తగరపువలస పట్టణ గ్రామదేవతలు ఎల్లారమ్మ, దుర్గాలమ్మ, కొత్తమ్మవార్లకు ఈ నెల 25న పసుపు కుంకుమలు ఇవ్వడానికి ఉత్సవ కమిటీ పెద్దలు తీర్మానించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎల్లారమ్మ మెట్టపై ఎల్లారమ్మకు, బంగ్లామెట్టపై దుర్గాలమ్మకు, కొండపేటలోని కొత్తమ్మవారికి తగరపువలస, బంగ్లామెట్ట, బాలాజీనగర్, శ్రీనగర్, రామన్నపేట, పాతలోకల్ ఆఫీసు వీధి, గాంధీబొమ్మ వీధి, రామవీధి, రాజవీధి తదితర గ్రామాలకు చెందిన ప్రజలు పసుపు కుంకుమలు ఇవ్వాలని కోరారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు



మధురవాడ: అమ్మలగన్న అమ్మ దుర్గామాతకు వివిధ ప్రాంతాల్లోని ఆలయాల్లో వైశాఖ శుద్ధ పాడ్యమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయం, సాక్షి ప్రెస్ వెనుక గల అయోధ్యనగర్‌లోని శ్రీవిజయదుర్గా మల్లికార్జున స్వామి దేవాలయంలో అమ్మవారికి నిత్యార్చనలు జరిపారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఆదివారం అక్షయ తృతీయ పురస్కరించుకుని కుంకుమ పూజలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు ఉచితంగా కిట్ల పంపిణీ

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామ సచివాలయంలో 25 మంది ఫైలేరియా బాధితులకు నగరానికి చెందిన బిఇడిటి–రీచ్ మి స్వచ్ఛంద సంస్థ సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి చేతుల మీదుగా శుక్రవారం ఉచితంగా కిట్లు అందించింది. బోదకాళ్లు, చేతుల వాపు ఉన్నవారికి అందించిన ఈ కిట్లలో మాత్రలు, ఆయింట్‌మెంట్, సబ్బు, టవల్ ఉన్నాయి. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వి.గురునాధరెడ్డి మాట్లాడుతూ బాధితులు ప్రతిరోజూ కాళ్లు, చేతులు శుభ్రం చేసుకుని, ఆయింట్‌మెంట్ పూసుకోవాలని సూచించారు. తీసుకోవలసిన జాగ్రతలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.వి. రమణ, ఆశ కార్యకర్త ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు


శ్రీవారికి సమర్పించేందుకు వస్త్రాలను తీసుకుని వస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని మహాలక్ష్మి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారికి అలంకరించేందుకు టీటీడీ అర్చకులు పట్టువస్త్రాలు తీసుకువచ్చారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం, భక్తులకు దర్శనం కల్పించారు.

పరదేశిపాలెంలో ప్రభుత్వ భూమి స్వాధీనం


హైవేని ఆనుకుని అధికారులు స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమి

మధురవాడ: విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెం రెవెన్యూ గ్రామంలో విలువైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలివీ.. కంబాలకొండ రిజర్వ్ ఫారెస్టుకు చెందిన గెడ్డ పోరంబోకు భూమి ఇక్కడ సర్వే నంబరు 56లో సుమారు 4.40 ఎకరాలు ఉంది. ఇందులో 50 సెంట్ల భూమి ఆశి గురుమూర్తిరెడ్డి అనే వ్యక్తి స్వాధీనంలో ఉంది. అయితే పరదేశిపాలేనికి చెందిన కొందరు ఆలయ నిర్మాణం, ఇతర అవసరాల కోసం ఇందులో సుమారు 15 సెంట్ల భూమిలో ఉన్న టేకు, నీలగిరి తదితర చెట్లను కొట్టి కొద్ది రోజులుగా పొక్లెయిన్‌తో చదును చేస్తున్నారు. దీంతో స్థానికుల ఫిర్యాదు మేరకు సచివాలయ వీఆర్వోలు యువరాజ్, హర్ష, అప్పలరాజు, తదితరులు పరిశీలించి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. 1990 నుంచి ఇందులో 50 సెంట్ల భూమిలో తాను అనుభవంలో ఉన్నానని, తన పేరు అడంగల్‌లో నమోదై ఉందని, భూమి శిస్తులు వంటివి కూడా చెల్లించానని ఆశి గురుమూర్తి రెడ్డి తెలిపారు. తాను వేసిన నీలగిరి, టేకు తదితర చెట్లను కొందరు ధ్వంసం చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

యథాస్థానంలో బుద్ధుని విగ్రహం ఏర్పాటు


మరమ్మతులు చేసి, రంగులు వేసి ఏర్పాటు చేసిన విగ్రహం

భీమునిపట్నం: భీమిలి బీచ్ వద్ద రోడ్డును ఆనుకుని ఉన్న బుద్ధుడి విగ్రహాన్ని అధికారులు తిరిగి యథాస్థానంలోకి చేర్చారు. ఆరు నెలల క్రితం వచ్చిన తుపాను ప్రభావంతో అలలు ముందుకు రావడంతో విగ్రహం ఉన్న దిమ్మ కింద గట్టు కోతకు గురై, అది బీచ్ ఇసుకలోకి జారిపడిపోయింది. విగ్రహం చాలా బరువుగా ఉండడంతో పైకి తీయడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇటీవల భారీ క్రేన్ సాయంతో విగ్రహాన్ని పైకి లాగి, పటిష్టంగా ఏర్పాటు చేసిన దిమ్మపై ఆ విగ్రహాన్ని ఉంచారు. దీనికి అవసరమైన మరమ్మతులను నిర్వహించడంతో పాటు రంగులు వేయడంతో ఎంతో ఆకర్షణీయంగా తయారైంది. కాగా, కొద్ది నెలలుగా విగ్రహం లేక వెలితిగా ఉండడంతో సందర్శకులు నిరాశ చెందుతున్నారు, ఇప్పుడు ఇది అందుబాటులోకి రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కల్వర్టు నిర్మాణానికి భూమి పూజ


శంకుస్థాపనలో పాల్గొన్న కార్పొరేటర్, నాయకులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు గుడ్లవానిపాలెం ఈనాడు లేఅవుట్‌లో రూ.15లక్షల తో నిర్మించనున్న కల్వర్టు నిర్మాణానికి శుక్రవారం కార్పొరేటర్ లొడగల అప్పారావు భూమి పూజ చేశారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు కల్వర్టు సమస్యను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి నిధులు మంజూరు చేశారని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, స్థానిక నాయకులు చిల్లా శ్రీనివాసరెడ్డి, పవన్, దువ్వి వాసు, వర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ


కంప్యూటర్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థినులు

భీమునిపట్నం: భీమిలిలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణను కలిగొట్ల స్విగ్ధశ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి చదువుకున్న పేద విద్యార్థినులకు శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు 96432 22666 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

గిరిజన భవన్ సందర్శన


మ్యూజియంను పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకట మురళి

కొమ్మాది: రుషికొండలోని గిరిజన సాంస్కృతిక, శిక్షణ మిషన్ భవన్‌ను శుక్రవారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ జె.వెంకట మురళి సందర్శించారు. ముందుగా ఇక్కడి మ్యూజియం, గ్రంథాలయం, కాన్ఫరెన్స్ హాలు, భవన్‌లోని అన్ని విభాగాలను పరిశీలించారు. సంస్థ కార్యకలాపాలు, పురోగతిని సమీక్షించారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణ పనులు ప్రారంభమైన నేపథ్యంలో.. నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలను కలుపుకోవాలని ఇక్కడి అధికారులను ఆదేశించారు. అనంతరం భవన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చినబాబు ఇక్కడ సిబ్బందిని ఆయనకు పరిచయం చేశారు.

చలానాల బకాయిల వసూలుకు చర్యలు

పీఎం పాలెం: ట్రాఫిక్ చలానాల బకాయిల వసూలుకు చర్యలు చేపట్టామని ట్రాఫిక్ ఎస్ఐ మురళీకృష్ణ తెలిపారు. ఆన్‌లైన్‌లో విధించిన చలానాలు చెల్లించకుండా తిరుగుతున్న వాహనాలపై శుక్రవారం పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కారుషెడ్ కూడలి, కొమ్మాది, మారికవలస ప్రాంతాల్లో వాహనాల తనిఖీ నిర్వహించారు. చలానాలు ఉన్న వాహన యజమానులపై చర్యలు తీసుకుంటున్నామ తెలిపారు.

ధరలు తగ్గించాలని పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

భీమునిపట్నం: పెరిగిన నిత్యావసర ధరలను తగ్గించాలని కోరుతూ శుక్రవారం మూడో వార్డులో సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర చేశారు. సీపీఎం నాయకుడు రవ్వ నర్సింగరావు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు ఏమాత్రం భరించలేని స్థాయిలో ధరలు ఆకాశానికి అంటుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై దృష్టి సారించి ధరలను నియంత్రించాలని కోరారు.

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ
- మూడో వార్డులో పర్యటన


బైపాస్ రోడ్డులో స్థానికులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

భీమునిపట్నం: స్థానిక సమస్యలను త్వరలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ తెలిపారు. జీవీఎంసీ మూడోవార్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. మెయిన్‌రోడ్డులోని మార్కెట్‌ను, తగరపువలస రోడ్డులోని వుడా క్రీడా మైదానాన్ని, లైట్‌హౌస్ వద్ద బీచ్‌రోడ్డు, దాని పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మూడో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు మాట్లాడుతూ ఇక్కడున్న కూరగాయలు, చేపల మార్కెట్ పూర్తిగా పాడైపోయాయని, వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని కోరారు. రోడ్డుకు ఆనుకుని ఉన్న పాత షాపులను తొలగించారని, వాటి స్థానంలో కొత్తవాటిని నిర్మాంచాలని విజ్ఞప్తి చేశారు. తగరపువలస రోడ్డులోని వుడా క్రీడామైదానంలో వాకింగ్ ట్రాక్ సరిగ్గా లేదని తెలిపారు. బీచ్ వద్ద అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతోందని, వాటిని పూర్తి చేయాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ వీటిల్లో వెంటనే పరిష్కారమయ్యే సమస్యలపై త్వరలో చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఆయన వెంట జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, ఇతర అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

తగరపువలస: జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ శుక్రవారం తగరపువలస బైపాస్ రోడ్డులో పర్యటించారు. ముందుగా జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న సర్వీస్ రోడ్లపై నిలిచిపోతున్న నీటిని పరిశీలించారు. తరువాత ఇక్కడి డ్రైనేజీల నుంచి మురుగునీటిని గోస్తనీనదిలోకి మళ్లించే మార్గాల అనుకూలతలపై బంగ్లామెట్ట వరకు పరిశీలించారు. అనంతరం ఇంటింటా చెత్త సేకరణపై స్థానిక మహిళలతో మాట్లాడారు. చెత్త సేకరణ వాహనం తెల్లవారుజామునే వస్తున్నట్టు వారు తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించే పాలిథిన్ వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అక్కరమాని రామునాయుడు, జగుపల్లి ప్రసాద్, తమ్మిన రామలక్ష్మణ, వార్డు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

భూఆక్రమణపై తహసీల్దారుకు ఫిర్యాదు

ఆనందపురం: తన సాగులో ఉన్న భూమిని ఆక్రమించారని పల్లా అప్పలనాయుడు అనే రైతు శుక్రవారం తహసీల్దారు రామారావుకు ఫిర్యాదు చేశారు. ముచ్చర్ల పంచాయతీ గొంపవానిపాలెంలో సర్వే నంబర్–1లో అప్పలనాయుడికి సుమారు 80 సెంట్లు మాన్యాస్ భూమి ఉంది. ఆ భూమి పక్కనే బాకురుపాలేనికి చెందిన సర్వే నంబర్లు, 70, 71లలో ఉన్న ప్రభుత్వ భూమిని సాగు చేసుకోగా.. గతంలో ఆ భూమిని కాలనీ కోసమని స్థానిక సర్పంచ్ తీసుకొని అందులోని మామిడి చెట్లను తొలగించారు. అప్పట్లో పక్కనే ఉన్న అప్పలనాయుడికి చెందిన ముచ్చర్ల పరిధిలోని 9 సెంట్ల భూమిని అతనికే విడిచి పెట్టారు. కాగా శుక్రవారం సుమారు 20 మంది పొక్లెయిన్‌ను తీసుకొని తన భూమిని చదును చేసి ఆక్రమించుకున్నారని అప్పలనాయుడు తహసీల్దారుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు చెప్పారని బాధితుడు తెలిపారు.

బక్కన్నపాలెంలో మజ్జిగ చలివేంద్రం


చలివేంద్రం ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు సాయిప్రియ గార్డెన్ రోడ్డులో బక్కన్నపాలెం వద్ద మాతృశ్రీ చారిటబుల్ ట్రస్ట్, బిల్డర్స్, శ్రీరామ బుద్ధ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, సంస్థ అధినేత పోతిన శివ, పోతిన వెంకటరామారావు తదితరులు ప్రారంభించి, మజ్జిగ పంపిణీ చేశారు. పాదచారులు, విద్యార్థులు, కార్మికులకు మజ్జిగతో పాటు, చల్లని నీరు కూడా అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు రూపొందించిన పేపర్ కవర్ల పంపిణీ


తగరపువలసలో దుకాణ యజమానికి పేపర్ కవర్లు అందిస్తున్న ఓక్రిడ్జ్ విద్యార్థులు

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఈ నెల 22న వరల్డ్ ఎర్త్ డే సందర్భంగా తగరపువలసలోని వివిధ దుకాణాలకు శుక్రవారం 500 పేపర్ కవర్లు పంపిణీ చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని దుకాణదారులతో ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణ హితంగా, వస్తువులను తగినంత బరువుతో తీసుకుపోవడానికి మళ్లీ మళ్లీ వినియోగించేలా తమ విద్యార్థులు ఈ పేపర్ కవర్లను తయారు చేశారని ప్రిన్సిపాల్ భమిడిపాటి శైలా అన్నారు. పర్యావరణ పరిరక్షణకు మరింత మంది అండగా నిలవాలని కోరారు.

పోలీసుల అదుపులో ఈవ్‌టీజర్

ఆరిలోవ: ఓ యువతిపై ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతూ సీపీ కంట పడిన యువకుడ్ని ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ శుక్రవారం ఉదయం రుషికొండ వైపు బీచ్ రోడ్డులో పోలీసు వాహనంలో వెళ్తున్నారు. ఆదే సమయంలో జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్ మధ్యలో ఓ యువతిని యువకుడు ఈవ్ టీజింగ్ చేస్తుండగా సీపీ గమనించారు. వారి దగ్గరకు వెళ్లేసరికి ఆ యువకుడు ద్విచక్ర వాహనంపై వెళ్లిపోయాడు. ఆ వాహనం నంబరు గుర్తుపెట్టుకున్న సీపీ అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందజేశారు. దీంతో పోలీసులు పీఎం పాలెం వద్ద ఆ నంబరు గల వాహనాన్ని పట్టుకొని ఈవ్ టీజింగ్‌కు పాల్పడిన యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో సంఘటన జరగడంతో ఆ యువకుడిని పీఎం పాలెం పోలీసులు ఆరిలోవ పోలీసులకు అప్పగించారు. ఇదిలా ఉండగా ఈవ్ టీజింగ్‌కు గురైన యువతి నుంచి పోలీసులుకు ఫిర్యాదు అందలేదు. ప్రస్తుతం ఆ యువకుడు అదుపులో ఉన్నట్లు ఆరిలోవ సీఐ సోమశేఖర్ తెలిపారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కబడ్డీ తెలుగు టైటాన్స్ సీఈవో త్రినాథ్‌రెడ్డి

తగరపువలస: రాజలింగంపేట గ్రామదేవత దుర్గాలమ్మ పండగ సందర్భంగా శుక్రవారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కబడ్డీ తెలుగు టైటాన్స్ సీఈవో జీరు త్రినాథ్ రెడ్డి హాజరయ్యారు. ఈ పోటీల్లో 14 గ్రామాల నుంచి 40 జట్లు తలపడనున్నాయి. విజేతలలో మొదటి మూడు జట్లకు రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు నగదు బహుమతులు అందించనున్నారు. కార్యక్రమంలో నాయకులు సమ్మి లక్ష్మణ, శిల్లా వంశీరెడ్డి, కొండపు సూరిబాబు పాల్గొన్నారు.

తిరుమలలో అవగాహన సదస్సు రేపు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీలో ఆదివారం 5 నుంచి 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు,వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ నున్న తిరుమలరావు ఓ ప్రకటనలో తెలిపారు. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్ పరీక్షలపై ఉదయం 9 గంటలకు జరిగే అవగాహన కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. ఈ సదస్సులో 10వ తరగతి తర్వాత చేరబోవు వివిధ కోర్సులకు సంబంధించి, అలాగే నీట్, ఐఐటీ, ఎన్ఐటీ పోటీ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో తెలియజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9133332103, 9133332104లో సంప్రదించవచ్చు.

పదేళ్లు దాటితే ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

మహారాణిపేట: ఆధార్ కార్డు తీసుకుని పదేళ్లు దాటితే కచ్చితంగా అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాస మూర్తి అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ రెండో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ్రస్ ప్రూఫ్, ఐడెంటిటీ ప్రూఫ్‌తో దగ్గరలోని ఆధార్ కేంద్రం, మండల ప్రధాన కేంద్రంలోని సచివాలయం, బ్యాంకులు, పోస్ట్ ఆఫీస్, వ్యక్తిగతంగా ఆన్‌లైన్‌లో గాని అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు. జూన్ నెల 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఆధార్ అప్‌డేట్ ఉచితమని పేర్కొన్నారు. అడ్రెస్ ప్రూఫ్ లేనట్లయితే వారి సచివాలయంలో 20/- చెల్లించి సర్టిఫికెట్ పొందవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో డీఎల్‌డీవో పూర్ణిమా దేవి , జెడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ , యూఐడీఏఐ రీజినల్ మేనేజర్ గిరిధర్ , వైద్య ఆరోగ్య శాఖ , బ్యాంకింగ్, పోస్టల్,ఎడ్యుకేషన్, బీఎస్ఎన్ఎల్ అధికారులు పాల్గొన్నారు.

26న బహిరంగ సభ

తగరపువలస: స్టీల్‌ప్లాంట్ మెయిన్‌గేటు వద్ద ఈ నెల 26న నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని వామపక్షాల నాయకులు కోరారు. తగరపువలస వద్ద కార్యక్రమ వాల్‌పోసర్లు విడుదల చేశారు. నాయకులు అల్లు బాబూరావు, ఆర్ఎస్ఎన్ మూర్తి, కానూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.